# చివరి కానుక

ఓ జర్నలిస్టుగా నేను చాలా అడ్వెంచర్స్ చేశాను. చాలా దూరప్రయాణాలు చేశాను. ఎంతోమందిని, రకరకాల మనస్తత్వాలు కల్గిన వాళ్ళను కలుసుకున్నాను. ఎంతో మందితో ఇంటరాక్టయ్యాను. వాళ్ళల్లో రాజకీయ నాయకులున్నారు, రచయితలున్నారు. సినిమావాళ్ళున్నారు, మేధావులున్నారు, సామాన్యులున్నారు. యువతీ యువకులున్నారు, సీనియర్ సిటిజెన్స్ ఉన్నారు, వ్యాపారవేత్తలున్నారు. గత పదేళ్ళల్లో ఎంతో వైవిధ్యభరితమైన జీవితం గడిపాను.

ముంబై, ఢిల్లీ, కలకత్తా, చెన్నై, హైదరాబాద్, బెంగ్లూరు లాంటి మహా నగరాల్లోని ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో లభించే స్వర్గ సుఖాల్ని అనుభవించాను. ఎన్నో చరిత్రాత్మక సంఘటనల్ని కవర్ చేస్తూ గొప్ప థ్రిల్‌ని, గొప్ప తృప్తిని పొందాను. కానీ ఇవన్నీ ఒక ఎత్తైతే మొన్న హైదరాబాద్ నుండి ఢిల్లీకి ఏ.పీ. ఎక్స్‌ప్రెస్‌లో చేసిన ప్రయాణంలో నేను పొందిన అనుభూతి సాంద్రత ఒక్కటే ఒకెత్తు.

ఢిల్లీలో జరుగుతున్న ఒక ముఖ్య సంఘటనను గూర్చిన లోతైన పరిశీలన కోసం ఒక ప్రముఖ పత్రికవారు నాకు ఢిల్లీకి వెళ్ళి రావాలన్న పనిని అప్పగించారు.

ఏ.పి. ఎక్స్‌ప్రెస్‌లో టూటైర్ ఏ.సి.లో బెర్త్ రిజర్వ్ చేయించుకున్నాను.

అది మార్చ్ నెల... ఎండలింకా తీవ్రతరం కాలేదు. నేను వెళ్ళాల్సిన రోజు ఉదయం ఆరింటి వరకు నాంపల్లి స్టేషన్ చేరుకున్నాను.

ఏ.పి. ఎక్స్‌ప్రెస్ రెడీగా ఉంది.

నా కంపార్ట్‌మెంట్ చేరుకొని నా బెర్త్ వెతుక్కొని కూర్చున్నాను. సూట్‌కేస్ తప్ప నాకు వేరే లగేజంటూ యేమీలేదు.

మా కంపార్ట్‌మెంట్‌లో పెద్దగా రష్‌లేదు. చాలా బెర్తులు ఖాళీగానే ఉన్నాయి. అవన్నీ సికింద్రాబాద్‌లో నిండిపోతాయనుకున్నాను.

ఆరోజు 'ది హిందూ' పేపర్ని తిరిగేస్తుండగానే – సరిగ్గా ఆరు ఇరవైకి – ట్రెయిన్ కదిలింది. కాస్సేపట్లోనే సికింద్రాబాద్ స్టేషన్ చేరుకున్నాం.

సికింద్రాబాద్ స్టేషన్లో చాలామంది ప్రయాణికులు మా కంపార్ట్‌మెంట్‌లో ప్రవేశించి ఎవరి బెర్తుల్ని వాళ్ళు వెతుక్కొని తమతమ సామాన్లని సర్దుకొని కూర్చుంటున్నారు. తమకు వీడ్కోలు చెప్పడానికొచ్చిన వాళ్ళకు గుడ్‌బైలు చెబుతున్నారు.

నా పక్క బెర్తు మీదకు పైన ఉన్న రెండు బెర్తులమీదకు ఎవరొస్తారా అని చూస్తున్నాను. పై బెర్తులమీదకు ఇద్దరు యువకులొచ్చారు. ట్రెయిన్ ఇంకాస్సేపట్లో

కదుల్తుందనగా బోల్డు లగ్గేజితో ఓ పాతిక ముప్పయి యేళ్ళ మధ్య ఉన్న ఓ యువతి మా కంపార్టమెంట్‌లో ప్రవేశించి నా పక్కబెర్త్ దగ్గరకొచ్చి "ఇదే నాబెర్త్" అంటూ తన వెనకనే ఉన్న ఇద్దరు కూలీలతో "ఆ సూట్‌కేసుల్ని ఈ బెర్తుల కింద పెట్టేయండి" అంది.

ఆమె వెంట వచ్చిన ఆ ఇద్దరు కూలీల నెత్తుల మీద రెండు పెద్ద పెద్ద నల్లటి సూట్‌కేసులున్నాయి. వాళ్ళు ఆ సూట్‌కేసుల్ని కిందకు దించుకొని బెర్తుల కింద, పక్కనా సర్దేశారు. ఆమె తన హ్యాండ్‌బ్యాగ్ తెరచి, దాంట్లో ఉన్న పర్స్ తీసి వాళ్ళకు డబ్బులిచ్చేసింది. వాళ్ళా డబ్బు తీసుకొని వెళ్ళిపోయారు.

"థాంగ్గాడ్!" అందామె తన సీట్లో కూర్చొని దీర్ఘంగా నిట్టూరుస్తూ. ఆమె అలా నిట్టూర్చిన కాస్సేపట్లోనే ట్రెయిన్ కదిలింది.

ఆమెనూ, ఆమె తెచ్చిన ఆ సూట్‌కేసుల్ని చూస్తోంటే ఆమె యే విదేశానికో వెళ్ళడానికి బయల్దేరినట్టనిపించింది.

మా కేబిన్‌లో ఉన్న మరో రెండు బెర్తులకు సంబంధించిన వాళ్ళొచ్చి తమ లగ్గేజిని వాళ్ళ బెర్తులమీద పెట్టేసి మా పక్క కేబిన్‌లోనే ఉన్న వాళ్ళ ఫ్రెండ్స్ దగ్గర కెళ్ళిపోయి కబుర్లు చెప్పుకోసాగారు.

మా కేబిన్‌లో ఆమె, నేనే మిగిలాం.

ఆమె కళ్ళు మూసుకొని యేదో ధ్యానంలో మునిగిపోయినట్టుగా కనిపించింది. కరెక్ట్ టైమ్‌కే ట్రెయినెక్కానన్న సంతృప్తి కనిపించింది ఆమెలో.

అప్పుడామెను పరీక్షగా చూశాను. ఆమెనిదివరకెప్పుడో, ఎక్కడో చూసినట్టుగా, ఆమె నాకు బాగా తెలిసిన మనిషిలా తోచింది. కొందర్ని చూస్తే మనకిలాంటి ఫీలింగ్ కల్గుతుంటుంది. అందుక్కారణం వాళ్ళ ముఖకవళికలు, వాళ్ళ మ్యానరిజమ్స్ మనం రోజూ చూసే చాలామందిని పోలి ఉండటం కావచ్చుననిపిస్తుంది. ఈమెను చూస్తోంటే ఈమె మన పక్కింటి అమ్మాయే అన్నట్టుగా ఫీలయ్యాను. చూడగానే ఆమె పెద్ద అందగత్తెగానో, జగదేక సుందరిలాగానో తోచలేదు. కాని చూస్తున్న కొద్దీ ఆకర్షించే రూపం ఆమెది. ఛాయనలుపు... నల్లటి పొడవైన జుట్టు... ఐదున్నరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గలావు, చురుకైన కాటుకకళ్ళు, విశాలమైన నుదురు, ఆ నుదుటి మీద దోసగింజంత ఎర్రటి బొట్టు, చక్కని ముక్కు సన్నటి పెదవులు, ఆరెంజ్ కలర్ పంజాబీ డ్రెస్ వేసుకుంది. రోజూ కనింపిచే ఎందరో మామూలు యువతుల్లాగే కనిపిస్తున్నప్పటికీ ఈమెలో ప్రత్యేక ఆకర్షణేదో ఉన్నట్టనిపించింది. అందుక్కారణం

తుమ్మెద రెక్కలాంటి ఆమె పొడవైన జుట్టు కావచ్చు. ఆ జుట్టును కింద రబ్బర్ బ్యాండ్‌తో కట్టేసి అలాగే వదిలేసింది తప్ప దాన్నో ఆర్డర్‌లో పెట్టటానికి ప్రయత్నించడం లేదు. ఆమె వేసుకున్న డ్రెస్‌లోనూ, చేసుకున్న అలంకరణలోనూ ఒకరకమైన నిర్లక్ష్య ధోరణి కనిపించింది. మరోసారి ఆమెను పరీక్షగా చూశాను. ఇప్పుడామె కళ్ళు తెరచి నాకేసి చూస్తోంది. ఆమె ఆకర్షణంతా ఆ కళ్ళల్లోనే ఉందేమోననిపించింది. కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు...

ఆమె కూడా నాకేసి ఈయననెక్కడో చూసినట్టుందే అన్నట్టుగా చూస్తున్నదనిపించింది.

"బండెడు లగ్గేజితో వచ్చేసి ఈ కేబిన్ మొత్తం నింపేసి నడవడానిక్కూడా చోటు లేకుండా చేశానని మీకు నామీద చాలా కోపమొస్తోంది కదండి?" ఉన్నట్టుండి అందామె నాకేసి సూటిగా చూస్తూ.

"కోపమేమీ రావడం లేదుగానీ మీరొక్కరే ఇన్ని పెద్దపెద్ద డ్రమ్ముల్లా ఉన్న సూట్‌కేసులతో రావడం చూస్తే కొంచెం ఆశ్చర్యం కల్గింది" అన్నాను చాలా కూల్‌గా.

"ఒక్కదాన్నేరాక యేం చెయ్యమంటారు చెప్పండి? మా హజ్బెండ్ అమెరికాలోని చికాగోలో ఉంటాడు. ఈ మధ్యనే మా పెళ్ళయిందిలెండి. పెళ్ళికాగానే ఆయన గారు అమెరికాకు ఉడాయించేశాడు. పదిరోజుల క్రితమే ఆయన పనిచేస్తున్న కంపెనీవాళ్ళే మేం ఉండటానికో ఇల్లిచ్చారట. వాళ్ళు ఇల్లివ్వగానే ఈయనగారు నన్ను వెంటనే వచ్చెయ్యమని ఫోన్లమీద ఫోన్లు... చాలా రోజుల క్రితమే టికెట్స్ పంపించాడు. కొత్తింట్లోకి కావలసిన సామాన్లన్నీ సర్దుకొని వెళ్ళమని మా అమ్మనాన్నలు నానా చెత్తంతా, మీరన్నట్టు ఈ డ్రమ్ములాంటి సూట్‌కేసుల్లో నింపేశారు.. నాతో ఢిల్లీదాకనన్నా ఎవరినైనా రమ్మన్నాను... ఎవరొస్తారు చెప్పండి? మా నాన్నేమో పెద్దవాడైపోయాడు... మా అన్నగారేమో సింగపూర్‌లో జాబ్ చేస్తున్నాడు... "యేం ఫరవాలేదు... నువ్వొక్క దానివే, ఢిల్లీదాక వచ్చేసి అక్కడ్నించి ఫ్లైట్ ఎక్కెయ్యమ'ని మా ఆయనగారు..." అందామె చాలా విసుగ్గా ముఖం పెట్టి.

ఆమె అలా విసుగ్గా ముఖం పెట్టినప్పుడింకా అందంగా కనిపించింది. అందమైన ఆడవాళ్ళు యేం చేసినా అందంగానే కనిపిస్తారనిపించింది. చక్కనమ్మ చిక్కినా ముద్దేనని ఇందుకే అంటారేమో!

"మీరు చికాగో వెళ్ళాలంటున్నారు కదా... హైదరాబాద్ నుండి చికాగోకు ఫ్లైట్ ఉందికదా... ఢిల్లీదాకా ఎందుకొస్తున్నారు..." అన్నాను... ఆమెతో ఎంత ఎక్కువసేపు మాట్లాడితే అంత హాయిగా ఉంది నాకు.

"హైదరాబాద్ నుండి చికాగోకు ఎయిర్ ఇండియా వారి ఫ్లైట్ ఉందని నాకూ తెలుసు... నేను హైదరాబాద్ నుండే చికాగో వస్తాననన్నాను... కానీ మా ఆయనగారు నాకు అమెరికన్ ఎయిర్‌లైన్స్ వారి టికెట్స్‌ని ఢిల్లీ నుండి చికాగోకు వచ్చేలా పంపించారు. మా ఆయన పనిచేసే కంపెనీవారే నా టికెట్స్‌ని అరేంజ్ చేశారట. మా ఆయన 'మోటరోలా' కంపెనీలో పనిచేస్తారు. 'మోటరోలా' కంపెనీ వాళ్ళకూ, అమెరికన్ ఎయిర్‌లైన్స్ వాళ్ళకూ మధ్య అగ్రిమెంట్‌లాంటిదేదో ఉందిట... అందుకని వాళ్ళు అమెరికన్ ఎయిర్‌లైన్స్ వాళ్ళ ఫ్లైట్స్‌లోనే వాళ్ళ ఉద్యోగస్తులకు ప్రయాణాలు ఏర్పాటు చేస్తారట... హైదరాబాద్ నుండి అమెరికన్ ఎయిర్‌లైన్స్ వారి ఫ్లైట్స్‌లేవు. ఢిల్లీ నుంచి ఉన్నాయి. అందుకని నేను చచ్చినట్టు ఢిల్లీదాకా ఈ గాడిద బరువుతో ప్రయాణం చెయ్యాల్సిందే... కాని గుడ్డిలో మెల్ల అన్నట్టు అమెరికన్ ఎయిర్‌లైన్స్‌లో వెళ్ళడం వల్ల ఒక సౌకర్యం ఉందిలెండి... అదేమిటంటే ఢిల్లీ నుండి డైరెక్టుగా ఎక్కడా దిగకుండా చికాగో వెళ్ళిపోతాం. 16 గంటలు ఏకబిగిన ప్రయాణం చేసి చికాగో చేరుకుంటాం. అదే హైదరాబాద్ నుండి ఎయిరిండియా వారి ఫ్లైట్‌లో వెళ్ళామనుకోండి. ముంబైలో ఫ్లైట్ మారాలి. ఓ మూడుగంటలు ముంబైలో వెయిట్ చెయ్యాలి. ముంబై నుండి బయల్దేరాక ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఆగాలి. అక్కడో రెండుమూడు గంటలు.. రీఫ్యూయలింగ్ అండ్ క్లీనింగ్ కోసం... ఆ తర్వాత చికాగో... ఇలా ఆగుతూ, ఆగుతూ, వెయిట్ చేస్తూ వెళ్ళడమంటే నాకు పరమ చిరాగ్గా ఉంటుంది" అందామె మళ్ళీ విసుగ్గా మొఖం పెడ్తూ.

"మీ హజ్బెండ్ చికాగోలో యేం చేస్తున్నారు?" అన్నాను.

"మోటరోలా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారలెండి. స్టార్టింగ్‌లో ఆయన ఇక్కడ అంటే మన హైదరాబాద్ మోటరోలా కంపెనీలో పనిచేస్తుండేవాడట. ఆయనకున్న అపారమైన తెలివితేటల్ని చూసి ఇక్కడి కంపెనీవాళ్ళే ఆయనను అమెరికాకు పంపించారట! ఆయన అమెరికాకు వెళ్ళాకే మా పెళ్ళి జరిగింది. నిజం చెప్పాలంటే... నాకు అమెరికాకెళ్ళడం అస్సలిష్టం లేదండి... యూ బిలీవిట్ ఆర్ నాట్!" అందామె చివరి మాటల్ని బాగా వొత్తి పలుకుతూ.

"మీలాంటి యంగ్ విమెన్ అమెరికాకు వెళ్ళాలని తెగ ముచ్చట పడిపోతోంటే మీరేమో అమెరికాకెళ్ళడం బొత్తిగా ఇష్టం లేదంటారేమిటి?"

"నిజంగా ఇష్టం లేదండీ! నాకిక్కడే బోల్డుమంది ఫ్రెండ్స్ ఉన్నారు. నాకు నా ఫ్రెండ్స్‌తో సరదాగా గడపడమంటే చాలా ఇష్టం. ఎప్పుడూ సినిమాలకు, పిక్నిక్‌లకు,

పెళ్ళిళ్ళకూ, పేరంటాలకూ వెళ్ళడమంటే భలే ఇష్టం. అమెరికాలో ఇవన్నీ కుదరవట కదా... ఎవరి ప్రపంచంలో వాళ్ళుంటారట... మన చుట్టుపక్కల కార్లు తప్ప మనకు మనుషులెవరూ కనిపించరట... ఆయనగారేమో ఉదయం లేవగానే ఆఘమేఘాలమీద తయారై ఆఫీసుకెళ్ళిపోతారు. నేనొక్కదాన్నే ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ఉండిపోవాలంటే నాకు సాధ్యమౌతుందా చెప్పండి? అక్కడి ఆ సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్ లాంటి జీవితాన్ని ఊహించుకుంటోంటేనే భయమేస్తోంది. ఆ జీవితం కంటే ఈ ట్రెయిన్ క్రిందపడి చచ్చిపోవడం బెటర్ అనిపిస్తోంది" అందామె... అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లోకి కన్నీళ్ళు ఉబికి రావడం చూసి నేను చాలా ఆశ్చర్యపడ్డాను. ఆ క్షణంలో ఆమె నాకెంతో దగ్గరయిపోయినట్టు ఫీలయ్యాను.

కాస్సేపు మా ఇద్దరిమధ్య నిశ్శబ్దం. ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోంచి కర్చీఫ్ తీసుకొని కళ్ళనీళ్ళు తుడుచుకొని తనను తాను సంభాళించుకొని అద్దాల్లోంచి బయటకు చూడసాగింది. ట్రెయిన్ వేగంగా ఒక స్టేషన్ తర్వాత మరో స్టేషన్ను దాటుకుంటూ వెళ్ళిపోతోంది.

"అమెరికా సంబంధం నేను చేసుకోనని చెప్పలేకపోయారా?" అన్నాను కొంచెం ధైర్యం చేసి... ఆమె ఎంతో చిరపరిచితురాలిలా ఫ్రీగా మాట్లాడటం నన్నింకా ఆమెతో మాట్లాడమని ప్రోత్సహించింది. ఆమె తన నొసలును తన వేళ్ళతో స్పృశిస్తూ "కర్మండీ కర్మ! అంత గొప్ప సంబంధం పోతే దొరకదని మా పెద్దవాళ్ళు ఒకటే గొడవ... ఈ పెద్ద వాళ్ళున్నారే... స్టుపిడ్స్! మన జీవితాల్ని వాళ్ళే నిర్ణయించాలను కుంటారు గానీ మన ఇష్టాయిష్టాలకు కొంచెం కూడా విలువియ్యరు. ఐహేట్‌దెమ్" అందామె చాలా కోపంగా.

నేనేమీ మాట్లాడలేదు... అద్దాల్లోంచి బయటకు చూస్తూ ఆలోచించాను. కాస్సేపు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

"ఇంతకూ మీరేం చేస్తున్నారో చెప్పలేదు?" అందామె. "నేనో ఫ్రీలాన్స్ జర్నలిస్టుని... ఓ ఇంపార్టెంట్ ఈవెంట్‌ని కవర్ చెయ్యడానికి 'టైమ్స్' పత్రికవాళ్ళు నన్ను ఢిల్లీ వెళ్ళిరమ్మన్నారు..."

"రియల్లీ!" అందామె కళ్ళు పెద్దవి చేసి చాలా ఆశ్చర్యంగా...

"నాకు జర్నలిజమంటే చాలా ఇష్టం. నా స్టూడెంట్ డేస్‌లో జర్నలిస్టును కావాలని కలలు గంటుండేదాన్ని... బి.ఏ. ప్యాసయ్యాక నేను హోయూలో డిప్లొమా ఇన్ జర్నలిజమ్ కూడా చేశాను" అందామె బోల్డు సంతోషపడిపోతూ...

"మరి మీరెందుకు జర్నలిస్టు కాలేకపోయారు?"

"చెప్పాగా... ఈ పెద్దవాళ్ళున్నారే... పరమ మూర్ఖులండీ... ఆడపిల్లలకు జర్నలిజం సరిఅయిన ప్రొఫెషన్ కాదుట. చాలా రిస్కులుంటాయట! మా నాన్నగారు నన్నో డాక్టర్ని చెయ్యాలని చాలా ప్రయత్నం చేశారు... కానీ నాకు సైన్సన్నా, మ్యాథ్స్ అన్నా అస్సలు పడేదికాదు. నేను బి.ఏ. తప్ప ఇంకేది చదవలేనని ఆయనకర్థమైంది లెండి. అదే నన్ను డాక్టర్ని కాకుండా కాపాడింది" అందామె కిలకిల నవ్వుతూ. అమె అలా నవ్వడం నాకెంత హాయిగా ఉందో!

"మిమ్మల్నేకాదు... చాలామంది ప్రాణాల్ని కూడా మీ నాన్నగారు కాపాడారు లెండి" అన్నాను. నా మాటవిని ఆమె గొల్లున నవ్వింది.

ఆమె ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉండాలనిపించింది. ఆమె నవ్వులో నా నవ్వును కలపడం ఒక అపూర్వ అనుభవం. కాస్సేపు మళ్ళీ నిశ్శబ్దం. "అవునూ! మీకు పెళ్ళయ్యిందా?" ఉన్నట్టుండి అడిగిందామె.

ఆమెకేసి నవ్వుతూ చూశాను.

"మీరేమనుకుంటున్నారు? అయిందనుకుంటున్నారా? కాలేదను కుంటున్నారా?" అన్నాను.

ఆమె కొంచెంసేపు నాకేసి పరీక్షగా చూసింది.

"మిమ్మల్ని చూస్తోంటే ఇదివరకు మిమ్మల్నెక్కడో చూసినట్టు, మీతో మాట్లాడినట్టు అనిపిస్తున్నదేమిటి?" అందామె తనతో తను మాట్లాడుకుంటున్నట్టుగా.

"ఆశ్చర్యం... మిమ్మల్ని చూసినప్పుడు నాకూ అలాగే అనిపించింది. 'జననాంతర సౌహృదాని' అంటారు. అలాంటి సంబంధమేదన్నా..." అన్నానేగానీ, ఆ మాటకామె ఎలా రియాక్టవుతుందోనని భయమేసింది.

"మీరేమంటున్నారో నాకర్థం కాలేదు గానీ... మీకు పెళ్ళయిందో కాలేదో చెప్పమంటారా?" అందామె నాకేసి అలాగే పరీక్షగా చూస్తూ.

"చెప్పండి చూద్దాం" అన్నాను.

"మీకు పెళ్ళికాలేదు" అందామె చాలా దృఢంగా.

నేను నవ్వాను.

"నాకు పెళ్ళికాలేదని అంత కచ్చితంగా ఎలా చెప్పగలరు"

"తెలీదు... మిమ్మల్ని చూస్తే అలా అనిపించింది. అంతే"

"నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా"

నా మాట వినడంతోటే ఆమె గొల్లున నవ్వింది.

"ఎందుకలా నవ్వారు?"

"మీరంత పెద్దజోక్ చేశాక నేను నవ్వకపోతే మీరు నొచ్చుకోరూ?"

నేను మళ్ళీ నవ్వాను.

"నేనిప్పుడు జోక్ చేశానా?"

"పెళ్ళయిందనీ, ఇద్దరు పిల్లలు కూడానని చెప్పడం జోక్ కాక మరేమిటి?"

"జోక్ కాదు... నిజం"

ఆమె మళ్ళీ నవ్వింది. ఆమె ఎప్పుడూ అలా నవ్వుతోంటే... అమెనలా నవ్వించగల్గుతున్నందుకు నాకెంత హాయిగా ఉందో!

"పెళ్ళయి ఇద్దరు పిల్లలున్న వాళ్ళెవరూ ఇంత కేర్‌ఫ్రీగా, ఇంత హాయిగా, ఇంత నిస్సంకోచంగా నాలాంటి ఓ ఆడపిల్లతో ఇలా కబుర్లు చెబుతూ కూర్చోలేరు" అందామె నావైపు తీక్షణంగా చూస్తూ.

ఈసారి గొల్లున నవ్వడం నావంతైంది.

"మీరు చాలా పొరబడ్డున్నారు. న్యూఢిల్లీ స్టేషన్‌కు నన్ను రిసీవ్ చేసుకోవడానికి మా ఆవిడొస్తుంది. ఆమెను మీకు చూపించి, మీకు పరిచయం చేస్తే నాకేమిస్తారు?"

"ఈ నాల్గు సూటుకేసుల్లోని ఓ సూట్‌కేసును మీ ఆవిడకిచ్చేసి నా బరువును కొంచెం తగ్గించుకుంటాను"

నేను మళ్ళీ గొల్లున నవ్వాను.

"నిజంగా ఇస్తారా... ఆ ఇచ్చేదేదో నాల్గు కాలాలపాటు గుర్తుండిపోయే సామాన్లున్న సూట్‌కేసివ్వండి"

"మీకెలాంటి సామాన్లున్న సూట్‌కేస్ కావాలో చెప్పండి"

"నిండా చీరెలున్న సూట్‌కేసివ్వండి. మీ ఆడవాళ్ళకు చీరెలంటే ప్రాణం కదా!"

"సారీ సర్! నాదగ్గరున్న సూట్‌కేసుల్లో చీరెలున్న సూట్‌కేస్ లేనేలేదు. ఎందుకంటే నేనస్సలు చీరలు కట్టనే కట్టను"

"ఫరవాలేదులెండి. మీరు కట్టేవే ఇవ్వండి... ఎలాగో అడ్జస్టయిపోతాం లెండి"

"మీది చాలా అడ్జస్టబుల్ నేచరనుకుంటాను... ఈ జీవితంలో సుఖపడాలంటే అడ్జస్ట్ మెంటాలిటీని అలవరచుకోక తప్పదులెండి" అందామె దీర్ఘంగా నిట్టూరుస్తూ.

ఆమె అన్న "మీది చాలా అడ్జస్టబుల్ నేచరనుకుంటాను" అన్న మాట నా మస్తిష్కాన్ని కదిలించింది. ఎక్కడో అణిగిమణిగి ఉన్న యేదో జ్ఞాపకాన్ని తట్టి లేపింది.

నాగురించి సరిగ్గా ఇదేమాటను నాతో ఒకామె పదేపదే అంటుండేది. ఎవరామె? ఆమే ఈమె కాదుకదా?

నా బుర్ర వేగంగా పనిచెయ్యసాగింది. జ్ఞాపకాల దొంతరలు సినిమారీళ్ళలా నా బుర్రలో కదిలిపోసాగాయి.

ఆమెను ఈసారింకా పరీక్షగా చూశాను.

సందేహంలేదు. ఈమెనిదివరకు ఎక్కడో చూశాను... చూడటమేకాదు... చాలాసేపు మాట్లాడానుకూడా... ఎక్కడ చూశానీమెను? గుర్తు చేసుకోవడానికి నా బుర్రలో ఉన్న శక్తినంతా కూడదీసుకొని ప్రయత్నించాను.

ఆమె మాట్లాడటం మానేసి హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న సిడ్నీషెల్డన్ నవల తీసి చదవడం మొదలెట్టోంది. కానీ మరుక్షణంలోనే పుస్తకం మూసేసింది.

"ఏమిటి మీరు సడెన్‌గా మాట్లాడటం మానేశారు... ఎనీథింగ్ రాంగ్? సడెన్‌గా ఎక్కడికో వెళ్ళిపోయారేమిటి?" అందామె కొంచెం కోపం, కొంచెం విసుగును ప్రదర్శిస్తూ. ఈ కొద్ది క్షణాల్లోనే ఆమెకు నామీదేదో హక్కు, అధికారం వచ్చేశాయి.

"అవును... ఎక్కడికో వెళ్ళిపోయాను... మీరు ఇదివరకెవరితోనన్నా 'మీది చాలా అడ్జస్టబుల్ నేచర్' అని చాలాసార్లు అంటుండేవారా?"

"ఎందుకలా అడిగారు?"

"పోనీయ్ ఇది చెప్పండి... మీరిదివరకెప్పుడైనా నల్లగొండలో కొంతకాలం ఉన్నారా?"

"ఉన్నాం... నేను నల్గొండలోనే ఇంటర్ చదివాను... మానాన్నగారక్కడ డిప్యూటీ కమ్మర్షియల్‌టాక్స్ ఆఫీసర్‌గా పనిచేశారు" అందామె నాకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"నౌ ఐ గాటిట్!" అరచినట్టుగా అన్నాను.

"యేమైంది? ఎందుకలా అరిచారు?" అందామె కొంచెం కంగారుపడిపోతూ.

"మీపేరు రజిత? అవునా?" అన్నాను చాలా ఉత్సాహంగా.

'అవును' అందామె యేమిటిదంతా అన్నట్టుగా.

"మీరు నల్గొండలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో మీకు రోహిత్ అనే ఓ ఫ్రెండుండేవాడు. వాళ్ళిల్లు, మీ ఇల్లు పక్కపక్కనే ఉండేవి. మీరతన్ని ఎప్పుడూ యేవో రెచ్చగొట్టే మాటలంటూ యేడిపించడానికి ప్రయత్నిస్తుండేవాళ్ళు. మీరొకసారి అతనికి చాలా ఇష్టమైన టీషర్ట్ తీసి దాచేశారు. మీరందరూ కలిసో ఫంక్షన్‌కు బయల్దేరుతున్న టైమ్‌లో మీరాపనిచేశారు. మిమ్మల్నతడు 'నా షర్ట్ ఇవ్వు' అని ఎంతో బతిమాలాడు.

కాని మీరాషర్ట్ ఇవ్వలేదు. పాపం. అతడు వేరే షర్ట్ వేసుకొని ఆ ఫంక్షన్‌కొచ్చాడు. అప్పుడు మీరతనితో "నీదెంత అడ్జస్టబుల్ నేచర్ బాబూ! మరీ సత్తెకాలం" అంటూ గేలిచేశారు. అప్పట్నించి మీరతన్ని 'మిస్టర్ అడ్జెస్టబుల్!' అని పిలుస్తుండేవాళ్ళు" నేను చకచకా చెప్పేస్తోంటే ఆమె ఆశ్చర్యంతో నోరు తెరుచుకొని వినసాగింది.

"ఓ మైగాడ్! ఆ రోహిత్ మీరే! నా ట్యూబ్‌లైట్ బుర్ర వెలగటానికి చాలా టైమ్ పట్టింది. మనమిలా కలుసుకోవడం ఎంత ఆశ్చర్యం! సింప్లీ ఫెంటాస్టిక్! సింప్లీ ఎక్సైటింగ్!" అందామె చేతుల్లో ముఖాన్ని దాచుకొని అదేపనిగా నవ్వసాగింది.

నేనూ "ఇది నిజమా! కలా!" అంటూ నవ్వసాగాను.

ఎంత అద్భుతం! ఈ ప్రపంచం ఎంత చిన్నదైపోయింది! దాదాపు పదేళ్ళ క్రితం విడిపోయిన మేం మళ్ళీ ఇలా ఓ ట్రెయిన్లో కలుసుకుంటామని కలలో కూడా ఊహించలేదు.

"వ్హాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్ రోహిత్!" అంటోందామె అలాగే నవ్వుతూ.

"నిన్ను చూసినప్పట్నించి నా బుర్ర ష్ట్రగులౌతోంది... ఈమెనెక్కడ చూశానా అని..." అన్నాను.

"నాకూ అలాగే అనిపించిందిగానీ నేనా ఫీలింగ్‌ని సీరియస్‌గా తీసుకోలేదు. కొందర్ని చూసినప్పుడు ఎందుకో అలా అనిపిస్తుందంతే! అనుకొని ఈయనను నిజంగా ఇదివరకెక్కడన్నా చూశానా అని గుర్తుచేసుకోవడానికి ప్రయత్నించలేదు. నువ్వు చాలా మారిపోయావు రోహిత్... ఆరోజుల్లో నువ్వు కొంచెం లావుగా వుండేవాడివి. 'ముద్దపప్పు' అంటూ కూడా నిన్ను యేడిపించేదాన్ని... ఇప్పుడింత లీన్‌గా, చాలా స్మార్ట్‌గా తయారయ్యావు... అందుకే నేను నిన్ను వెంటనే గుర్తుపట్టలేకపోయాను. 'మేరానామ్ జోకర్' సినిమాలో రిషీకపూర్ ఎలా ఉండేవాడో నువ్వలా ఉండేవాడివి... ఇప్పుడు చాలా మారిపోయావు" అందామె నన్ను తన కళ్ళనిండా చూసుకుంటూ.

"నువ్వు కూడా చాలా మారిపోయావు రజితా! అప్పుడు నువ్వు చాలా సన్నగా, అచ్చం బాపు బొమ్మలా ఉండేదానివి" అన్నాను ఆమెను నా కళ్ళనిండా చూసుకుంటూ... ఆమెను చూడటానికి నా రెండు కళ్ళు సరిపోవనిపించింది.

"ఇప్పుడెలా ఉన్నానంటావు?"

"ఇప్పుడు రాజా రవివర్మ బొమ్మలా ఉన్నావు"

ఆమె అందంగా సిగ్గుపడింది.

"అంటే... నేను బాగా లావెక్కాననా నీ ఉద్దేశ్యం" అందామె నా నెత్తిమీద మొట్టికాయ వేయబోతూ...

"అందుకు సందేహమా?" అన్నాను.

"లావెక్కి చాలా అసహ్యంగా తయారయ్యానంటావా?" అందామె యేడుపు ముఖం పెట్టి.

"లేదు. అప్పటికంటే ఇప్పుడే బావున్నావు... 'టైటానిక్' సినిమా హీరోయిన్ కేట్ విన్‌స్లెట్ కొంచెం లావున్నా ఎంత బావుంటుందో! నువ్వూ అలా వున్నావు"

"రియల్లీ! కేట్ విన్‌స్లెటంత బావున్నానా?" అందామె కళ్ళు పెద్దవి చేసి.

"రియల్లీ!" అన్నాను.

"లావుగా ఉండేవాళ్ళంటే నాకిష్టముండదని ఆరోజుల్లో అంటుండేవాడివి కదా!"

"అది అప్పటిమాట. ఇది ఇప్పటిమాట!"

"సమయానుకూలంగా ఒపినియన్స్ మార్చుకుంటావన్నమాట!"

"నాది అడ్జస్టబుల్ నేచరని నీకు తెలుసుకదా!"

"అమ్మదొంగా... నామాట నాకే అప్పచెప్పావన్నమాట... ఆరోజుల్లో నేనెన్ని మాటలన్నా జవాబు చెప్పేవాడివికాదు... ఇప్పుడు మాటకు మాట భలేగా చెబుతున్నావే... యూహేవ్ బికమ్ వెరీ స్మార్ట్ రోహిత్!"

"నాది అడ్జస్టమెంటాలిటి కదా... నా ప్రొఫెషన్‌లో స్మార్ట్‌గా ఉండకపోతే ముందుకెళ్ళలేం..."

"నీ ప్రొఫెషనేకాదు... ఇవ్వాళ్ళ యే ప్రొఫెషనయినా చాలా స్మార్ట్‌గా, చాలా ఫాస్ట్‌గా ఉండకపోతే బతకలేం... అవునూ... రేపు నిన్ను న్యూఢిల్లీ స్టేషన్‌లో రిసీవ్ చేసుకోబోయే మీ ఆవిడ బాపుబొమ్మా? లేక రాజా రవివర్మ బొమ్మా?" అంటూ ఆమె కిలకిలా నవ్వింది. నేనూ నవ్వాను.

"బాపు బొమ్మకాదు. రవివర్మ బొమ్మకాదు" అన్నాను.

"మరి?" అందామె మూతిని క్వశ్చన్‌మార్క్‌లా పెట్టి.

"ఆ బొమ్మ నా స్వాప్నిక ప్రపంచంలో మాత్రమే ఉంటుంది. ఆమె నాకు తప్ప మరెవరికీ కనిపించదు"

"అనుకున్నాను"

"యేమనుకున్నారు"

"ఆమె నీ ఊహల్లో తప్ప నిజంగా ఉండదని"

నేను నవ్వాను.

"అయితే నువ్వింకా పెళ్ళి చేసుకోలేదన్నమాట"

"అన్నమాటే"

"చాలా మంచిపని చేశావు"

"యేమిటా మంచిపని?"

"పెళ్ళి చేసుకోకపోవడమే"

"ఎందుకు"

"పెళ్ళిచేసుకున్న మరుక్షణంలో మన స్వేచ్ఛలో సగభాగం ఆవిరైపోతుంది. పెళ్ళికి ఇది నెగిటివ్ సైడ్. దీనికో పాజిటివ్‌సైడ్ కూడా ఉంది"

"యేమిటో అది"

"పెళ్ళి చేసుకోకపోవడం వల్ల మీరు దేశసేవకూడా చేస్తున్నారు..."

"ఎలా"

"ఆల్‌రెడీ దేశజనాభా విపరీతంగా పెరిగిపోతున్నది. మీరు దాన్నింకా పెంచడం లేదు"

ఇద్దరం నవ్వుకున్నాం.

ఇక్కడ్నించి మా సంభాషణ మేం నల్లగొండలో మూడేళ్ళు పక్కపక్కనే ఉంటూ గడిపిన క్షణాల మీదకు మళ్ళింది. అప్పుడు మామధ్య జరిగిన ఎన్నో సంఘటనల్ని గుర్తుచేసుకున్నాం.

నల్లగొండ గవర్నమెంట్ కాలేజిలో మానాన్న లెక్చరర్‌గా పనిచేసేవాడు. వాళ్ళ నాన్న డిప్యూటీ కమ్మర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా పనిచేస్తుండేవాడు. మా రెండు కుంటుబాల వాళ్ళం పక్కపక్క ఇళ్ళల్లో ఉంటూ చాలా అన్యోన్యంగా గడిపేవాళ్ళం.

అప్పుడు రజిత టెన్త్ చదువుతోంది. నేను బి.ఎస్‌సీ. మ్యాథ్స్ చదువుతున్నాను. పాపం, రజిత లెక్కల్లో చాలా పూర్. ఒకసారి వాళ్ళమ్మ, మా అమ్మ మాట్లాడుకుంటుంటే "మా రజితకు లెక్కలు బొత్తిగారావండి... టెన్త్ ఎలా ప్యాసవుతుందో యేమిటో?" అందిట. "మావాడు లెక్కల్లో చాలా బ్రిలియంటండీ! వాడు వాడి క్లాస్‌మేట్స్‌కు లెక్కలు చాలా బాగా చెబుతాడు" అని మా అమ్మ అందిట. అంతే! లెక్కలు చెప్పించుకోవడానికి రజిత నా దగ్గరకొస్తుండేది. నిజంగానే నేను లెక్కలు చాలా బాగా చెప్పేవాడిని. ఆమెకు ఈజీగా అర్థమయ్యేలా లెక్కల్ని ఆమెకు చెప్పి ఆమెచేత చేయించడం ప్రాక్టీసు చేయించాను. నేనామెకు లెక్కలు చెప్పడం వల్లనే ఆమె టెన్త్ ప్యాసయ్యిందని వాళ్ళ అమ్మా, నాన్న, వాళ్ళ అన్నయ్య – అందరూ నాకు వేలవేల థాంక్స్ చెప్పారు.

టెన్త్ ప్యాసయ్యాక రజిత ఇంటర్‌లో చేరింది. ఆమెను బైపీసి గ్రూపు తీసుకొమ్మని వాళ్ళ నాన్నగారు చాలా బలవంతం చేశారు.

'నాకు సైన్స్ అర్థం కాదని, ఆ గ్రూపు తీసుకుంటే నేను ఫెయిలవడం ఖాయమ"ని గొడవచేసి రజిత ఆ గ్రూపు తీసుకోలేదు. ఆర్ట్స్ గ్రూపు తీసుకుంది.

ఇంటర్‌లో చేరినప్పట్నించి రజిత నాతో చాలా చనువుగా ఉండేది. ఎప్పుడూ యేవో చిలిపి పనులు చేస్తూ నన్ను ఉడికించడానికి ప్రయత్నించేది. నేనెక్కువగా పుస్తకాలతో గడుపుతూ, లెక్కలు చేసుకుంటూ మరీ బుద్ధిమంతుడిలా కనిపించేవాడిని. నా ప్రపంచంలో నేనుండిపోతూ ఎక్కువగా మాట్లాడేవాడిని కాను. నన్ను రెచ్చగొట్టి నాతో మాట్లాడించాలని ఆమె ప్రయత్నించేది. నేను చాలా డల్‌గా ఉంటానన్న అభిప్రాయంతో నన్ను "ముద్దపప్పు" అని పిలిచేది. ఎలాంటి పరిస్థితినైనా నేను ప్రశాంతంగా ఎదురుకోవడం చూసి నాకామె "మిస్టర్ అడ్జస్టబుల్!" అన్న పేరు కూడా పెట్టేసింది.

"నిన్ను చేసుకోబోయే ఆమె ఎవరోగాని చాలా అదృష్టవంతురాలు" అంటుండేది. "ఎందుకంటే?" నువ్వు గౌతమ బుద్ధుడంతటి శాంతమూర్తివి కదా!" అనేది.

ఆమె ఇంటర్ పూర్తిచేశాక వాళ్ళ నాన్నగార్కి నల్లగొండ నుండి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫరయింది. వాళ్ళు నల్గొండ నుండి వెళ్ళిపోతున్నప్పుడు మా కుటుంబ సభ్యులందరమూ చాలా బాధపడిపోయాం. మా అమ్మా, వాళ్ళమ్మా కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. నాకూ, రజితక్కూడా కళ్ళనీళ్ళొచ్చాయి.

పైకి కనిపించలేదు గానీ నేను చాలా బాధపడిపోయాను. రజితలాంటి స్నేహితురాల్ని కోల్పోవడం నన్నంతగా కృంగదీస్తుందని నేను ఊహించలేదు. ఆమె వెళ్ళిపోతున్నప్పుడర్థమైంది, నాకెంత దగ్గరయ్యిందో.

"నువ్వంటే నాకు చాలా ఇష్టమ"ని ఆమెతో చాలాసార్లు చెప్పాలనుకున్నాను. ఒక్కొక్కసారి "ఐలవ్‌యూ!" అని కూడా చెప్పాలనిపించేది. కానీ ఆ కోరికను బలంగా నాలోనే అణచేసుకున్నాను. ఎందుకంటే నేనలా చెప్పిన మరుక్షణంలో అంత అన్యోన్యంగా ఉంటున్న మా రెండు కుటుంబాలు విడిపోయేవి. వాళ్ళు చాలా డబ్బున్నవాళ్ళు. స్నేహం వరకు ఫరవాలేదు గానీ అంతకుమించి ముందుకెళ్తే వాళ్ళు అంగీకరించేవాళ్ళు కాదని నాకర్థమయింది.

ఇలా ఆనాటి ముచ్చట్లన్నీ చెప్పుకుంటూ వెళ్తోంటే స్థలకాలాల్ని పూర్తిగా మరచిపోయాం.

ట్రెయిన్ ఆంధ్రప్రదేశ్ దాటి మహారాష్ట్రలో ప్రవేశించింది.

బల్లార్షాలో లంచ్ చేశాం.

ఒక్క క్షణాన్ని కూడా వృథా చేయకుండా ఇద్దరం గత స్మృతుల్లోకెళ్ళిపోయాం. ఆనాటి ఆ ప్రపంచంలోనే ఉండిపోయాం. మధ్యమధ్య టీలు, బిస్కట్లు సేవిస్తూ మాట్లాడుకున్నాం.

సాయంత్రం నాల్గింటికి నాగపూర్ చేరాం. మా ఇద్దరు పై బెర్తుల ప్రయాణీకులు నాగపూర్‌లో దిగిపోయారు. చాలా ఆశ్చర్యంగా ఆపై రెండు బెర్తులు ఖాళీగానే ఉండిపోయాయి. మా ఇద్దరి ప్రైవేసీని చెడగొట్టకుండా ఆ పై బెర్తులను ఖాళీగా ఉంచినందుకు రైల్వే వాళ్ళకు కృతజ్ఞతలు చెప్పాలనిపించింది.

మా ట్రెయిన్ మహారాష్ట్రను కూడా దాటేసి మధ్యప్రదేశ్‌లో ప్రవేశించేటప్పటికి చీకటిపడిపోయింది.

మధ్యప్రదేశ్‌లోని వింధ్య పర్వతాల మీదుగా మా ట్రెయిన్ వెళ్తోంది.

'ఇట్టార్సీ' జంక్షన్ చేరేటప్పటికి రాత్రి పది గంటలు దాటింది. అక్కడే రాత్రి భోజనం చేశాం.

ట్రెయిన్ 'ఇట్టార్సీ' స్టేషన్ కూడా దాటింది.

మేం కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నాం. కాస్సేపు నవ్వుతూ, కాస్సేపు సీరియస్‌గా చర్చిస్తూ, కాస్సేపు బాధపడ్తూ, కాస్సేపు ఒకరితో ఒకరం పోట్లాడుకుంటూ, వాదించుకుంటూ గంటలగ్గంటలు గడిపేశాం.

టైమ్ రాత్రి పదకొండు దాటింది.

ట్రెయిన్ దట్టమైన చీకటిని చీల్చుకుంటూ ఓ అడవి మధ్యలోంచి వెళ్తోంది. అలా వేగంగా వెళ్తున్న ట్రెయిన్ ఎందుకో స్లో అయిపోయి కాస్సేపట్లోనే ఆగిపోయింది.

చుట్టూ దట్టమైన చీకట్లో దట్టమైన అడవి.

ఈ అడవిలో ట్రెయినెందుకు ఆగిపోయింది?

సిగ్నల్ ఇవ్వలేదేమో...

త్వరలోనే ట్రెయిన్ ఆగటానికి సిగ్నల్ కారణం కాదని తెలిసిపోయింది.

మా పక్క కంపార్ట్‌మెంట్‌లో యేదో కలకలం.... హాహాకారాలు... అరుపులు... కేకలు... యేదో జరిగింది...

పక్క కంపార్ట్‌మెంట్‌లో ఉన్న టి.టి.ఇ. చాలా కంగారుగా పరిగెత్తుతున్నట్టుగా మా కంపార్ట్‌మెంట్‌లోకొచ్చి బయటి తలుపుల్ని మూసేసి బోల్టు పెట్టేశాడు.

"పక్క కంపార్ట్‌మెంట్‌లోకి దొంగలొచ్చారు... వాళ్ళకోసమే ట్రెయిన్‌లో ఉన్న వాళ్ళ మనిషి ఎవరో చెయిన్‌లాగి ట్రెయిన్ను ఆపేశారు. ఎవరూ బయటకెళ్ళొద్దు... దొంగలు మన కంపార్ట్‌మెంట్‌లోకి కూడా రావచ్చు. మీ దగ్గర క్యాష్‌గానీ, గోల్డు

ఆర్నమెంట్స్‌గానీ ఉంటే ఎక్కడయినా దాచెయ్యండి... యే చిత్తు కాగితాల్లోకో తోసెయ్యండి..." అన్నాడు.

మా కంపార్ట్‌మెంట్‌లో అప్పటికే చాలామంది నిద్రపోతున్నారు... కానీ టి.టి.ఇ. చెప్పిన మాటలు విని అందరూ లేచి "దొంగలు... దొంగలు..." అంటూ హాహాకారాలు చెయ్యసాగారు.

"వోమైగాడ్! దొంగలొచ్చారా? ఇప్పుడెలా రోహిత్!" అంది రజిత వణికిపోతూ.

"యేం కాదు రజితా! వాళ్ళు మన కంపార్ట్‌మెంట్‌లోకి రాలేదు కదా... భయపడకు... యేంకాదు..." అన్నాను ఆమెకు ధైర్యం చెప్పడానికి ప్రయత్నిస్తూ.

నిజానికి దొంగలనగానే నేను కూడా చాలా డిస్టర్బ్ అయ్యాను. కానీ డిస్టర్బయినట్టుగా కనిపించకుండా ఉండటానికి ప్రయత్నించాను.

"నాదగ్గర చాలా డబ్బుంది రోహిత్... ఎలా?" అందామె ఇంకా వణికిపోతూ... చాలా చల్లగా ఉన్న ఆ ఏ.సీ. కంపార్ట్‌మెంట్‌లో కూడా ఆమె మొఖమంతా చెమట నిండిపోవడం చేస్తోంటే ఆశ్చర్యం కల్గింది.

"యేంకాదు... నువ్వు భయపడకు రజితా! ఈ ట్రెయిన్లో రైల్వే ఆర్మ్‌డ్ పోలీసులున్నారు... వాళ్ళు దొంగల్ని పట్టుకుంటారు... నువ్వు భయపడకు" అన్నాను.

"మావాళ్ళు నాకు పదివేల డాలర్లిచ్చారు. నన్ను అమెరికానుండి వచ్చేటప్పుడు గోల్డు కొనుక్కురమ్మన్నారు..." అంది రజిత నిలువెల్లా వణికిపోతూ.

"అదెక్కడ పెట్టావో తీసి నాకివ్వు. యేదైనా సేఫ్‌ప్లేస్‌లో పెట్టేస్తాను" అన్నాను.

ఆమె తన పక్కనే ఉన్న హ్యాండ్‌బ్యాగ్ తెరచి దాంట్లో ఉన్న డాలర్ నోట్లకట్టను తీసి నాకిచ్చింది.

ఆ నోట్లకట్టను నా సూట్‌కేసులో ఉన్న ఓ పుస్తకంలో పెట్టేసి, దాన్ని నా బెర్త్ కిందకు తోసేశాను.

బయట్నించి పెద్దగా కేకలు... అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. మా కంపార్ట్‌మెంట్‌లో ఉన్నవాళ్ళందరూ భయంతో అరుస్తున్నారు. ఆడవాళ్ళందరూ తమ మెడల్లో ఉన్న మంగళసూత్రాల్ని, చేతులకున్న బంగారు గాజుల్ని తీసేసి వాళ్ళ భర్తలకిస్తున్నారు. ఆ క్షణంలో వాటిని ఎక్కడ పెట్టాలని తోస్తే అక్కడ పెట్టేస్తున్నారు. అంతా గందరగోళం... అయోమయం... భయం... ఆర్తనాదాలు... హాహాకారాలు... బయట యేం జరుగుతున్నదో ఎవరికీ తెలియడం లేదు.

"వాళ్ళు మనదగ్గరున్న క్యాష్‌నో, గోల్డునో ఎత్తుకుపోతే ఫరవాలేదు గానీ... మనకు ప్రాణహాని తలపెట్టకపోతే బావుండును" అన్నాడో పెద్దమనిషి.

"మనం రెసిస్ట్ చేస్తే అంతపనీ చేస్తారు. ఎవరూ రెసిస్ట్ చెయ్యొద్దు. మన దగ్గర యేదుంటే అది... నోరు మెదపకుండా ఇచ్చేద్దాం... బతికుంటే బల్సాకుతిని బతకొచ్చునన్నారు" అన్నాడు ఇంకో పెద్దమనిషి.

"నేను వద్దంటున్నా ఈ నెక్లెస్ వేసుకొని వచ్చావు... నీకు బుద్ధిలేదు" అంటూ కసురుతున్నాడు ఓ భర్త తన భార్యను.

ఆ భార్య భోరుమని యేడవడం మొదలెట్టింది. ఇంకా కొందరు ఆడవాళ్ళు కూడా భోరుమని యేడ్వసాగారు.

"వాళ్ళు మన కంపార్ట్‌మెంట్‌లోకి కూడా వస్తారా రోహిత్?... నాకు చాలా భయమేస్తోంది" అంది రజిత నా చేయిని గట్టిగా పట్టుకొని.

"రాకపోవచ్చు... ఆలోగా పోలీసులొస్తారు. డోన్ట్‌వర్రీ రజితా! ఇలాంటప్పుడే ధైర్యంగా వుండాలి" అన్నాను నేనూ ఆమె చేతిని పట్టుకొని.

నేనలా అంటుండగానే మా కంపార్ట్‌మెంట్ తలుపుల్నెవరో బలమైన ఆయుధాలతో బాదుతున్నారు... కాస్సేపట్లోనే ఆ తలుపులు తెరచుకున్నాయి... నల్గురు వ్యక్తులు... నల్లటి దుస్తులు... మొఖం మీద నల్లటి ముసుగులు ధరించి లోపల కొచ్చేశారు...

వాళ్ళను చూడగానే మా కంపార్ట్‌మెంట్‌లో కొందరు భయంతో ఫెయింటయి పోయారు...

వాళ్ళు లోపలకొచ్చి బ్రోకెన్ హిందీలో "మీదగ్గర యేదుంటే అది ఇచ్చేయండి!" అంటున్నారు.

వాళ్ళ చేతుల్లో గడ్డపారల్లాంటి బలమైన ఆయుధాలేవో ఉన్నాయి. ఒకడి చేతిలో పిస్టల్ కూడా ఉంది.

మొదటి వరసలో ఉన్నవాళ్ళు వాళ్ళ దగ్గరున్న క్యాష్‌నీ, గోల్డ్‌నీ వాళ్ళ చేతుల్లో పెడ్తున్నారు...

నల్లటి దుస్తుల్లో ఉన్నవాళ్ళు చూడటానికి చాలా భయంకరంగా ఉన్నారు.

వాళ్ళను చూడగానే రజిత గట్టిగా కళ్ళు మూసుకొని నన్ను కౌగలించుకుంది. వాళ్ళు ఒకరి తర్వాతొకరి దగ్గరకు వచ్చేస్తున్నారు... కాస్సేపట్లో వాళ్ళు మమ్మల్ని సమీపిస్తారు. నాదగ్గర రెండువేలరూపాయల క్యాష్‌ను వాళ్ళకిచ్చేద్దామని నిర్ణయించు కున్నాను. వాళ్ళు నా దగ్గరకు రాగానే వాళ్ళ చేతిలో రెండువేల రూపాయల నోట్లని పెట్టేశాను. అంతే! మా కంపార్ట్‌మెంట్‌లోకి ఇద్దరు రైఫిళ్ళు ధరించిన పోలీసులొచ్చేశారు.

"కదిలారంటే కాల్చేస్తాం" అన్నారు వాళ్ళు దొంగలమీదకు గన్స్‌ని ఎక్కుపెట్టి...

క్షణంలోనే దిబదిబమని పరిగెత్తుతూ దొంగలు ట్రెయిన్ నుండి కిందకు దూకేశారు. పోలీసులు వాళ్ళమీదకు ఆరురౌండ్ల కాల్పులు జరిపారు. కానీ ఆ చిమ్మచీకట్లో ఎవరికీ ఆ బుల్లెట్లు తాకినట్టులేదు... తర్వాత టార్చ్‌లైట్లు వేసి ఆ దొంగల్లో ఎవరికైనా బుల్లెట్లు తాకాయోమోనని వెతికారు. కానీ ఎవ్వరూ కనిపించలేదు.

సరిగ్గా అరగంటలో ఇదంతా జరిగిపోయింది.

మా కంపార్ట్‌మెంట్‌లోకి ఇంకా కొందరు ఆర్మ్‌డ్ పోలీసులు, రైల్వే అధికారులూ వచ్చారు.

"దొంగలు పారిపోయారు. మీరందరూ ధైర్యంగా ఉండండి... దిస్ ట్రెయిన్ ఈజ్ వెల్ ప్రొటెక్టెడ్... నెక్ట్స్ స్టేషన్లో ఇంకా కొంతమంది ఆర్మ్‌డ్ పోలీసుల్ని తీసుకుంటాం... ఎవ్వరూ భయపడొద్దు. ఆ దొంగల్ని పట్టుకుంటాం... ఎవరెవరి దగ్గర యేమేం పోయాయో చెప్పండి..." అన్నాడు టి.టి.ఇ.

ముందు వరసలో ఉన్న నాలాంటి ఐదారుగురు ప్యాసెంజర్స్ మాత్రమే కొంత క్యాష్‌నూ, కొన్ని ఆర్నమెంట్స్‌ని పోగొట్టుకున్నారు. ఆ వివరాల్ని రాసుకున్నాక ట్రెయిన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సరిగ్గా ఒక గంట తర్వాత ట్రెయిన్ కదిలింది.

అందరూ 'థాంగ్గాడ్' అంటూ ఊపిరితీసుకున్నారు.

అందరూ ఎవరి బెర్తులదగ్గరకు వాళ్ళు వెళ్ళిపోయారు.

"థాంక్యూ రోహిత్! ఈరోజు నువ్వీ కంపార్ట్‌మెంట్‌లో నా పక్కన లేకపోతే నేను భయంతో గుండె ఆగి చచ్చిపోయేదాన్ని" అంది రజిత నామీదకు ఒరిగిపోతూ.

"ఎవరి గుండె ఆగిపోదు రజితా! ఊహించుకోవడంలో ఉన్నంత భయం నిజంగా ఉండదు. ఇదిగో నీ డాలర్స్!" అంటూ బెర్త్‌ని పైకిలేపి పుస్తకాన్ని బయటకు తీసి దాంట్లో ఉన్న డాలర్ల నోట్లకట్టను తీసి రజిత చేతిలో పెట్టాను.

"థాంక్యూ రోహిత్... థాంక్యూ వెరీమచ్... నీ మేలును ఈ జన్మలో మరచి పోలేను..." అంది రజిత.

"వచ్చే జన్మలో మరచిపోతావా?" అన్నాను.

ఆమె నవ్వింది.

"నువ్వు మళ్ళీ నవ్వావు... థాంగ్గాడ్! నీ కళ్ళల్లో కనిపించిన ఆ భయాన్ని చూస్తే నాకెంత భయమేసిందో!..." అన్నాను.

"నాకింకా ఆ భయంపోలేదు రోహిత్!" అంది రజిత.

"కమాన్ రజితా! ఇప్పటికైనా కూలయిపో... నథింగ్ హేపెన్డ్... ఇదీ ఒక అనుభవమే అనుకో. ఎప్పుడూ గుర్తుండిపోయే అనుభవాల్లో ఇదొకటనుకో... ఇవన్నీ

పెర్ఫెక్ట్‌లైఫ్ అనుకోవాలే తప్ప కృంగిపోకూడదు... దేనికైనా అడ్జస్టయిపోవాలి..." అన్నాను.

"ఇదేగదా నీలో నాకు బాగా నచ్చేది. నీ అడ్జస్టమెంటాలిటీ ఈజ్ రియల్లీ గ్రేట్" అంది రజిత. అలా అంటూనే ఆమె నా నొసలుమీద ముద్దుపెట్టుకుంది.

"థాంక్యూ!" అన్నాను. కృతజ్ఞతాపూర్వకంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"అబ్బాయిగార్కి భలే ధైర్యం వచ్చేసిందే... ఆరోజుల్లో నేను కాస్త దగ్గరకొస్తేనే కంగారు పడిపోతుండేవాడివి!" అంది రజిత.

"నిజమే... దగ్గరకొచ్చి యేం చేస్తావోనని భయపడిపోయేవాడిని..." అన్నాను.

"అలా ఇప్పుడేమన్నా చేస్తే భయపడవా?" అందామె చిలిపిగా నాకేసి చూస్తూ.

"భయపడను గానీ ఇక కాస్సేపు పడుకుందాం రజితా!" అన్నాను లేచి నిల్చొని నా బెర్త్‌మీద. ఆమె బెర్త్‌మీద రైల్వే వాళ్ళిచ్చిన బెడ్‌షీట్స్‌ని పరుస్తూ.

నా బెర్త్ మీద పడుకొని బ్లాంకెట్ కప్పుకుంటూ "నువ్వు కూడా పడుకో రజితా" అన్నాను.

"నాకీ రాత్రి నిద్రరాదు రోహిత్" అంది తనూ పడుకుంటూ.

"ఎందుకు?" అన్నాను.

"దొంగలు మళ్ళీ వస్తారేమోనన్న భయం నన్ను వదలటం లేదు రోహిత్!" అందామె బ్లాంకెట్ కప్పుకొని.

నేను మా బెర్తులను బయటకు కనిపించకుండా చేసే కర్టెన్లను లాగేసి లైట్ ఆఫ్ చేశాను.

"దొంగలిక రారు రజితా! నువ్వు హాయిగా పడుకో!" అన్నాను.

"లేదు రోహిత్! దొంగలు మళ్ళీ వస్తారు... వాళ్ళ రూపాల్ని గుర్తుచేసుకుంటే నాకు భయమేస్తోంది"

"యేదీ గుర్తుచేసుకోకు... పసిపిల్లలా ప్రవర్తించకు. దొంగలు మళ్ళీరారు..."

"నిజంగా రారా రోహిత్... నాకేమీ కాదా?"

"నీకేంకాదు. నీ ప్రాణానికి నా ప్రాణం. రేపు నిన్ను ఢిల్లీలో అమెరికన్ ఎయిర్‌లైన్స్ వారి విమానం ఎక్కించేంతవరకు నేను నీకు బాడీగార్డులా ఉంటాను. సరేనా... ఇక హాయిగా నిద్రపో..."

"నువ్వు నాకు బాడీగార్డులా ఉంటానంటే నాకింకేంకావాలి రోహిత్! ఫ్లైట్ ఎక్కించేంత వరకే కాదు... జీవితమంతా నువ్వే నాకు బాడీగార్డులా ఉంటే ఎంత హాయిగా ఉండేదాన్నో..." అందామె.

"ఇప్పుడూ హాయిగానే ఉంటావు... ఇక పడుకో"

కాస్సేపు నిశ్శబ్దం. ఆమె అన్న ఆమాట నన్ను కలల్లోకి పంపించింది. నిజంగానే ఈ రజితను నాదాన్ని చేసుకుంటే నా జీవితం ఎంత మధురంగా మారిపోయేదో అనుకున్నాను. ఆమెతో యే నక్షత్రమండలంలోకో తేలిపోతున్నట్లుగా కలలుగనటం మొదలెట్టాను.

ఆమె నిద్రలోకెళ్ళిపోయిందనుకున్నాను. నేనూ అలా కలలు కంటూనే నిద్రపోవడానికి ప్రయత్నించాను.

ఐదు నిమిషాలు గడిచాయో లేదో

"రోహిత్!" అని అరుస్తూ లేచికూర్చుంది రజిత.

"యేమైంది రజితా!" అన్నాను నేనూ లేచి కూర్చొని.

"కళ్ళు మూసుకున్నానో లేదో... ఓ పీడకల... నల్లటి ముసుగులు కప్పుకొని దొంగలొచ్చినట్టుగా... నామీద పడి నా దగ్గరున్నదంతా దోచుకుంటున్నట్టుగా... నా గొంతు నులుముతున్నట్టుగా... నేను 'రోహిత్' అని అరుస్తున్నాను. నువ్వెక్కడా కనిపించడం లేదు. ట్రెయినంతా వెతుకుతున్నాను. కానీ నువ్వెక్కడా కనిపించడం లేదు. భయంతో గొంతు పూడుకుపోయింది. కాళ్ళు భూమిలో కూరుకుపోయాయి. నోటమాట రావడం లేదు... పారిపోదామని ప్రయత్నిస్తే కాళ్ళు కదలటం లేదు. 'రోహిత్!' అని నా శక్తినంతా కూడదీసుకొని అరచేటప్పటికి మెలకువ వచ్చింది... చూడు రోహిత్, చూడు... నా శరీరమంతా ఎలా చెమట్లు పట్టాయో..." అందామె తన గొంతుమీదికి నా చేతిని లాక్కుంటూ.

నిజమే! ఆమె శరీరమంతా చెమటతో తడిచిపోయింది.

"నువ్వు బాగా డిస్టర్బయ్యావు రజితా! నీకేం భయంలేదు. నేను నీపక్కనే కూర్చుంటాను. నువ్వు పడుకో" అన్నాను.

"లేదు రోహిత్, నా భయం పోవాలంటే నేనొచ్చి నీబెర్తు మీదనే నీ పక్కనే పడుకుంటాను. నీకేమైనా అభ్యంతరమా?"

"అభ్యంతరమే... నువ్వు నీ బెర్తుమీదనే పడుకోవాలి. నేను నిద్రపోకుండా నిన్నే చూస్తూ కూర్చుంటాను... సరేనా" అన్నాను.

"ప్లీజ్ రోహిత్! నేనొచ్చి నీపక్కనే పడుకుంటాను రోహిత్... ప్లీజ్ రోహిత్... నాకు చాలా భయమేస్తోంది రోహిత్! కళ్ళుమూసుకుంటే చాలు, నాకా దొంగలే కనిపిస్తున్నారు..." అందామె రెండు చేతులు జోడించి.

నేనామెకేసి కాస్సేపు అలాగే చూస్తూ ఉండిపోయాను. ఎంత దీనంగా ప్రార్థిస్తోందామె! ఎలా వద్దనను?

"సరే... వచ్చేయి" అన్నాను.

ఆమె వచ్చి బ్లాంకెట్ కప్పుకొని నా పక్కనే నామీద చేతులు వేసి, పసిపిల్లలా నా గుండెలకు హత్తుకుపోతూ పడుకుంది.

"థాంక్యూ రోహిత్! నాకిప్పుడు చాలా బావుంది" అందామె నా చెవుల్లో గుసగుసగా.

ఆమెనలా చూస్తోంటే తల్లిఒడిలో పడుకొని నిద్రపోతున్న ఓ పసిపాప చిత్రం నా కళ్ళముందు మెదిలింది.

ఆమె నాకింకా, ఇంకా దగ్గరగా రాసాగింది. కాసేపట్లోనే ఆమె నన్ను పెనవేసుకొని యే భయమూ లేకుండా హాయిగా నిద్రపోతోందని అర్థమైంది.

నాకు నిద్రరాదు.

మెల్లగా ఆమెతో పెనవేసుకుపోయిన నా శరీరంలో వస్తున్న మార్పుల్ని గమనిస్తూనే ఉన్నాను. నా ప్రమేయం లేకుండానే నా రక్తం వేడెక్కుతోంది. ఆమె శరీరం నా శరీరంలోకి విద్యుత్తులాంటి శక్తినేదో పంపిస్తున్నది. నా నరనరాల్లో కోరిక బుసలు కొడ్తూ విజృంభిస్తోంది. ఆమెను పూర్తిగా ఆక్రమించుకోవాలని... ఆమె శరీరంలోకి ప్రవేశించాలని నా శరీరం ఉవ్విళ్ళూరుతోంది.... కానీ నాలో ఆమెను యేమీ చేయకూడదన్న బలమైన ఫీలింగ్... ఆమె నీదగ్గరకు రక్షణకోసం వచ్చింది... ఆమెను రక్షించడం వరకే నీ బాధ్యత... ఆమె అవసరాన్ని నీ స్వార్థంకోసం ఉపయోగించుకుంటే నీలాంటి నీచుడు మరొకడుండడు. బుద్ధికీ, శరీరానికి, ఇంటలెక్ట్‌కూ, ఇన్‌స్టింక్ట్‌కూ మధ్య సంఘర్షణ... టుడూ ఆర్ నాట్టుడూ... టుయాక్ట్ ఆర్ నాట్టుయాక్ట్... ఇలాంటి సందిగ్ధంలో పడే ఆమెను నీదాన్ని చేసుకోలేకపోయావు... ఇప్పుడైనా... కొన్ని క్షణాలవరకైనా ఆమెను నీదాన్ని చేసుకో... ఆమెతో గడిపిన ఈ మధుర క్షణాలకు క్లైమాక్స్‌గా ఆమెతో కలిసిపో... ఆమెలో చేరిపోయి, ఆమెతో ఐక్యమైపోయిన ఈ క్షణాల్ని నీలో శాశ్వతం చేసుకో... కమాన్... ఆమెకూడా నీతో కలయికకు ఒప్పుకుంటుంది... వద్దు వద్దు... ఆమె వివాహిత... ఆమె భర్తతో ఇంకా మొదటిరాత్రి గడిపి ఉండదు... ఆమె అనాఘ్రాతపుష్పం... ఆ పుష్పం ఆమె భర్తకే స్వంతం కావాలి... నోనోనో... ఆమెకు భర్తంటే యిష్టంలేదు. ఆ విషయం ఆమె చెప్పకనే చెప్పింది. చాలా పిచ్చిగా ఆలోచిస్తున్నావు. ఒకరాత్రి కొన్ని క్షణాల వరకు ఆమె నీ స్వంతమైనంత మాత్రాన ఈ ప్రపంచం మునిగిపోదు. ఆమె పవిత్రతకు ఎలాంటి భంగం వాటిల్లదు. ఆమె శరీరమేమీ మైలపడిపోదు. ప్రేమతో ఇరువురి శరీరాలు కలిసిపోయినందువల్ల ఆ శరీరాలు మైలపడిపోవడం, అనాఘ్రాతపుష్పం...

ప్రూతపుష్పంగా మారటం, ఇవన్నీ మన మనస్సులో సంప్రదాయం సృష్టించిన మిత్స్, భ్రమలు... ఇదంతా ఆమెకూ ఇష్టమే కాబట్టి తను చేస్తున్న దాంట్లో తప్పేమీలేదు... స్త్రీ పురుషులిద్దరికీ ఇష్టమైనప్పుడు వాళ్ళిద్దరి శరీరాలను ఐక్యం చేయడంలో దోషం లేదు. అలా ఐక్యం చెయ్యకపోవడమే దోషం... పరమాన్నాన్ని బంగారు పళ్ళెంలో పెట్టి వడ్డిస్తానంటే వద్దంటావా మూర్ఖుడా! నోనోనో... ఆమె తనదగ్గరకు కేవలం రక్షణకోసమే వచ్చింది. అంత మాత్రాన నీ శరీరంతో నా శరీరాన్ని ఐక్యం చేస్తానంటే ఆమె అంగీకరించకపోవచ్చు.. అంగీకరించకపోవడమే కాదు... అసహ్యించుకోవచ్చు కూడా... ఆమె తన పక్కలో పడుకున్న ఓ పసిపాప!... అంతే!... ఆమెను ఓ పసిపాపను ఆదుకున్నట్టే ఆదుకోవాలి తప్ప మరేమీ చెయ్యకూడదు...

భళ్ళున తెల్లారేదాకా నాలో ఇవే ఆలోచనలు... చివరకామెను నేనో పసిపాపగానే భావించాను. భావించి నాలో చెలరేగుతున్న వేరే ఆలోచనల్ని సంహరించుకున్నాను.

ఉదయం ఎనిమిదింటివరకు ట్రెయిన్ న్యూఢిల్లీ స్టేషన్ చేరింది.

ఆమె ఆరింటికే లేచింది.

"వ్హాట్! నేను రాత్రి నీబెర్తు మీదకొచ్చి పడుకున్నానా? నాకు గుర్తేలేదు..." అందామె తన డ్రెస్‌ను సవరించుకుంటూ. నేను తననేమీ చెయ్యలేదని ఆమెకర్థమైంది.

"పసిపాపలా వచ్చి నాపక్కలో చేరావు" అన్నాను.

ఆమె చాలా ఆశ్చర్యంగా నాకేసి చూసింది.

"యూ ఆర్ రియల్లీ ఎ నైస్ గై" అంటూ వచ్చి నా పెదాలను తన పెదవులతో కలిపింది.

నేను 'థాంక్యూ' అన్నాను.

"దీసీజ్ మై పార్టింగ్ గిఫ్టుయూ. ఇది నీకు నా చివరి కానుక రోహిత్!" అంది మరోసారి నన్ను ముద్దుపెట్టుకుంటూ. నేను మరోసారి 'థాంక్యూ' అన్నాను.

ఆమెను రిసీవ్ చేసుకోవడానికి ఢిల్లీలో ఉండే ఆమె కజినొకతడు న్యూఢిల్లీ స్టేషన్‌కొచ్చాడు. ఆమె నాకు 'బై' చెప్పేసి అతనితో వెళ్ళిపోయింది. కనిపించినంత మేరకు ఆమెనే చూస్తూ ఉండిపోయాను. ఒక మధురమైన కలలోంచి మేలుకున్నట్టుగా మేలుకొని నా దారిన నేను వెళ్ళిపోయాను.

'విపుల' మాసపత్రిక (ఆగస్టు, 2008)